క్లుప్తంగా

14న శ్రీమతి నెల్లూరు -2024 గ్రాండ్ ఫినాలే



నెల్లూరు(బృందావనం): మహిళల్లో చైతన్యంతో పాటు ఆనందం, ఆహ్లాదం కలిగించేందుకు ఈ నెల 14న నగరంలోని జీఎస్సార్ ఫంక్షన్ హాల్‌లో 'శ్రీమతి నెల్లూరు- 2024' గ్రాండ్ ఫినాలే కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు 25 కళాసంఘాల అధ్యక్షుడు అమరావతి కృష్ణారెడ్డి తెలిపారు. బ్లాసం బ్లూ ఈవెంట్స్ సునీల్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ కార్యక్రమానికి సంబంధించిన ఆహ్వాన పత్రికలను గాంధీబొమ్మ సమీపంలో 25 కళాసంఘాల ఛాంబర్‌లో సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అమరావతి కృష్ణారెడ్డి మాట్లాడుతూ మహిళా చైతన్యంతోనే సమాజం ప్రగతి పథంలో పయనిస్తుందన్నారు. శ్రీమతి నెల్లూరు-2024 గ్రాండ్ ఫినాలేలో నగరంలోని మహిళలు, యువతులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ సమావేశంలో 25 కళాసంఘాల కన్వీనర్లు దోర్నాల హరిబాబు, అమీర్‌జాన్, ఎస్ హరనాథ్‌రెడ్డి, భాస్కర్, జీఎమ్మార్ మురళీరెడ్డి, దుర్గాఅఖిల్, హీరోయిన్ రేణుప్రియ, డ్యాన్స్‌మాస్టర్ నటరాజ్, బీఎస్సార్ శ్రీనివాసులురెడ్డి పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీకే గౌడ సంఘ మద్దతు



నెల్లూరు(వీఆర్సీసెంటర్): వైఎస్సార్‌సీపీకే జై గౌడ సంఘం మద్దతు ఇస్తుందని ఆ సంఘ రాష్ట్రాధ్యక్షుడు ఉదయగిరి నరసింహులుగౌడ్ తెలిపారు. నగరంలోని హోటల్ అభిరామ్‌లో గౌడ కులస్తుల ఆత్మీయ సమావేశాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా నరసింహులు గౌడ్ మాట్లాడుతూ గౌడ్‌ల సంక్షేమాభివృద్ధికి కృషి చేస్తున్న వైఎస్సార్‌సీపీకే మద్దతు ఇవ్వాలని తీర్మానించినట్లు తెలిపారు. నెల్లూరు రూరల్ పరిధిలోని గౌడ కులస్తులను కలుపుకుని వైఎస్సార్‌సీపీ నుంచి నెల్లూరు పార్లమెంట్, నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే అభ్యర్థులుగా పోటీ చేస్తున్న విజయసాయిరెడ్డి, ఆదాల ప్రభాకర్‌రెడ్డి విజయానికి కృషి చేయనున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో చిరంజీవి, సుబ్రహ్మణ్యం, పరమేష్, హరిప్రసాద్, నవీన్, కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

కార్పొరేషన్ నిబంధనలు పాటించాలి



నెల్లూరు(బారకాసు): ప్రజారోగ్య పరిరక్షణకు కార్పొరేషన్ సూచించిన నిబంధనలను వ్యాపార అనుమతులు పొందిన ప్రతిఒక్కరూ విధిగా పాటించాలని ఎంహెచ్‌ఓ వెంకటరమణ సూచించారు. అల్లీపురంలోని ఐస్‌బర్గ్ ఆర్గానిక్ ఐస్‌క్రీమ్ తయారీ యూనిట్‌ను సోమవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ట్రేడ్ లైసెన్స్‌లు, ఎన్‌ఓసీ సర్టిఫికెట్లు, తాగునీటి సదుపాయం, మరుగుదొడ్లు, పారిశుధ్య నిర్వహణ, తదితర అంశాలను ఆయా ప్రాంగణాల్లో పరిశీలించి మరింత మెరుగుపరచాలని నిర్వాహకులకు సూచించారు. అనంతరం కార్పొరేషన్ అనుమతుల కోసం దరఖాస్తు చేసుకున్న గుడపల్లిపాడులోని చైతన్య స్కూల్‌ను పరిశీలించారు. సౌకర్యాలు పూర్తిగా కల్పించిన తరువాత మరోసారి తనిఖీ చేసి అనుమతులు మంజూరు చేస్తామని ఆయన తెలిపారు.

రెండో పంటకు సాగునీరు లేదు

బుచ్చిరెడ్డిపాళెం రూరల్ : కనిగిరి రిజర్వాయర్ కింద రెండో పంట సాగుకు నీరు అందించలేమని నీటి పారుదలశాఖ డీఈ మధు తెలిపారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. కొందరు రైతులు రెండో పంటకు సిద్ధమవుతున్నట్లు తెలిసిందన్నారు. కనిగిరి రిజర్వాయర్‌లోని నీరు తాగునీటి అవసరాలకు మాత్రమే సరిపోతున్నందున రెండో పంటలకు నీరివ్వలేమని తెలిపారు.

అప్రమత్తంగా ఉండాలి

- ఎస్పీ ఆరిఫ్ హఫీజ్



వెంకటాచలం : ఎన్నికలు పూర్తయ్యే వరకు పోలీసు అధికారులు, సిబ్బంది తమ విధుల్లో అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ కె.ఆరిఫ్ హఫీజ్ అన్నారు. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో వెంకటాచలం పోలీస్‌స్టేషన్, టోల్‌ప్లాజా వద్ద సోమవారం రాత్రి ఎస్పీ ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ టోల్‌ప్లాజా వద్ద చెక్‌పోస్టుకు ఇరువైపులా ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేయాలన్నారు. మద్యం అక్రమ రవాణా, నగదు, ప్రలోభపరిచే వస్తువులు తరలించకుండా అరికట్టాలని ఆదేశించారు. ఫిర్యాదులపై వెంటనే స్పందించాలన్నారు.

సంక్షేమ పథకాలతో ఆర్థిక భరోసా

- వైఎస్సార్‌సీపీ నెల్లూరు సిటీ ఎమ్మెల్యే అభ్యర్థి ఎండీ ఖలీల్‌అహ్మద్



ఎన్నికల ప్రచారం చేస్తున్న ఖలీల్‌అహ్మద్

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): రాష్ట్రంలోని అన్ని వర్గాల్లోని పేదలకు సంక్షేమ పథకాలను అమలు చేసి ఆర్థిక భరోసా కల్పించిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని వైఎస్సార్‌సీపీ నెల్లూరు సిటీ ఎమ్మెల్యే అభ్యర్థి ఎండీ ఖలీల్‌అహ్మద్ అన్నారు. నగరంలోని 16వ డివిజన్ పరిధిలోని రాంజీనగర్ 2,3 వీధులు, 3వ డివిజన్ పరిధిలోని ప్రశాంతినగర్, విశ్వశాంతినగర్, సీతారామిరెడ్డి వీధి తదితర ప్రాంతాల్లో సోమవారం ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ తిరిగి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ప్రజలకు జరిగిన మేలును వివరించే కరపత్రాలను పంచి ఓట్లను అభ్యర్థించారు. ఈ సందర్భంగా ఖలీల్‌అహ్మద్ మాట్లాడుతూ జగనన్న సంక్షేమాభివృద్ధి పాలనలో ప్రజలు ఎంతో సంతోషంగా ఉన్నారన్నారు. నెల్లూరు ఎంపీ అభ్యర్థిగా విజయసాయిరెడ్డి రావడంతో పార్టీ నాయకులు, కార్యకర్తలు నూతనోత్సాహంతో పని చేస్తున్నారన్నారు. నగరాన్ని ఎంతో అభివృద్ధి చేశారని నారాయణ చెప్పుకోవడం హాస్యాస్పదంగా ఉందన్నారు. ఎమ్మెల్యే అనిల్‌కుమార్ దాదాపు రూ.1180 కోట్లతో నగరంలో అభివృద్ధి పనులు చేపట్టారని తెలిపారు. నారాయణ చెప్పే అబద్ధపు మాటలను ప్రజలు ఎవ్వరూ నమ్మరన్నారు. నగరాభివృద్ధికి రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీని ఆశీర్వదించాలని కోరారు. నెల్లూరు ఎంపీగా వేణుంబాక విజయసాయిరెడ్డి, నెల్లూరు సిటీ ఎమ్మెల్యేగా తనను ఫ్యాన్‌గుర్తుపై ఓటేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు వేనాటి శ్రీకాంత్‌రెడ్డి, సంక్రాంతిఅశ్విని, తదితరులు పాల్గొన్నారు.

నెల్లూరు అభివృద్ధికి ప్రత్యేక మేనిఫెస్టో



విజయసాయిరెడ్డికి మద్దతుగా ప్రచారం చేస్తున్న కుమార్తె నేహారెడ్డి

నెల్లూరు సిటీ: నెల్లూరు అభివృద్ధికి తొలిసారిగా ప్రత్యేక మేనిఫెస్టో విడుదల చేసిన ఘనత తన తండ్రి వైఎస్సార్‌సీపీ ఎంపీ అభ్యర్థి విజయసాయిరెడ్డికి దక్కుతుందని ఆయన కుమార్తె నేహారెడ్డి పేర్కొన్నారు. రూరల్ నియోజకవర్గ పరిధిలోని 19వ డివిజన్ మాగుంటలేఅవుట్‌లో సోమవారం ఆమె ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నెల్లూరు అభివృద్ధి కోసం ఎంపీగా తన తండ్రి విజయసాయిరెడ్డి, రూరల్ ఎమ్మెల్యేగా ఆదాల ప్రభాకర్‌రెడ్డిని ఫ్యాన్ గుర్తుపై ఓటేసి గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమాభివృద్ధి పాలనపై ప్రజలు సంతృప్తితో ఉన్నారని, రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ తప్పక విజయం సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు..

ఉగాది, శ్రీరామనవమి ఉత్సవాలు ప్రారంభం



విశేషాలంకారంలో సాయినాథుడు



అఖండసాయినామ సంకీర్తన సప్తాహం

నెల్లూరు(బృందావనం): బాలాజీనగర్‌లోని పద్మావతినగర్ సాయిదర్బార్ అద్దాల మందిరంలో ఉగాది, శ్రీరామనవమి ఉత్సవాలు సోమవారం ప్రారంభమయ్యాయి. ఉత్సవాల్లో భాగంగా షిర్డీ సంప్రదాయరీతిలో ఏడు రోజుల పాటు నిర్విరామంగా రేయింబవళ్లు నిర్వహించే అఖండ సాయినామ సంకీర్తన సప్తాహ మహాయజ్ఞాన్ని మందిర మేనేజింగ్ ట్రస్టీ మధుసాయి ఉదయం 6గంటలకు 'అఖండ జ్యోతిప్రజ్వలన' చేసి ప్రారంభించారు. తొలిరోజు సాయినాథుడు విశేషపుష్పాలంకరణలో భక్తులకు నయనానందకరంగా దర్శనమిచ్చారు. ఉభయకర్తగా నెల్లూరు వెంకటసుబ్బారెడ్డి వ్యవహరించారు. ఈ నెల 17న శ్రీరామనవమి సందర్భంగా షిర్డీ సంప్రదాయరీతిలో ఉదయం విష్ణుసహస్రనామ సామూహిక పారాయణం, సాయంత్రం 6గంటలకు శ్రీసాయినాథుని దివ్యరథోత్సవం, వెండి పల్లకి సేవ, ముస్లింల గంధోత్సవం (ఉరుసు), జెండా ఉత్సవం నిర్వహించనున్నట్లు మధుసాయి తెలిపారు. నగరోత్సవం సాయిదర్బార్ అద్దాల మందిరం నుంచి బయలుదేరి ఏసీనగర్ వరకు సాగుతుందని వివరించారు. ఈ నెల 18న ఉత్సవాల ముగింపు సందర్భంగా ఉదయం 9 నుంచి సాయంత్రం 6గంటల వరకు సాయిసచ్చరిత్ర పారాయణం నిర్వహించనున్నట్లు వివరించారు. భక్తులు విశేషంగా పాల్గొని సీతారామలక్ష్మణహనుమంతులతో పాటు సాయిబాబాను దర్శించుకుని తీర్థప్రసాదాలను స్వీకరించాలని కోరారు.

ఉగాది శుభాకాంక్షలు

నెల్లూరు సిటీ: క్రోధి నామ తెలుగు సంవత్సరాది ఉగాది పండగను పురస్కరించుకుని నెల్లూరు రూరల్ నియోజకవర్గ ప్రజలకు వైఎస్సార్‌సీపీ నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే అభ్యర్థి, ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో శుభాకాంక్షలు తెలిపారు. తెలుగు వారి సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతిబింబంగా నిలిచే ఉగాది పర్వదినాన్ని ప్రతి ఒక్కరూ ఆనందోత్సాహాలతో జరుపుకోవాలని ఆకాంక్షించారు. ఉగాది పచ్చడిలాగే అందరి జీవితాలు షడ్రుచుల సంగమంగా మారాలని, ప్రతిఒక్కరూ కొత్త సంవత్సరంలో ఆయురారోగ్యాలతో, అష్టైశ్వర్యాలతో వర్ధిల్లాలని అభిలాషించారు.

కృత్రిమంగా పండ్లను మగ్గబెడితే చర్యలు



పండ్ల దుకాణంలో తనిఖీలు చేస్తున్న ఎంహెచ్‌ఓ వెంకటరమణ

నెల్లూరు(బారకాసు): కృత్రిమ పద్ధతుల్లో పండ్లను మగ్గబెట్టి విక్రయిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని మున్సిపల్ హెల్త్‌ఆఫీసర్ వెంకటరమణ హెచ్చరించారు. చిన్నబజారులోని పండ్ల మార్కెట్‌ను సోమవారం ఆయన తనిఖీ చేశారు. పలు దుకాణాల్లో కార్బైడ్‌ను వినియోగించి కృత్రిమంగా మామిడి, అరటి పండ్లను మగ్గబెట్టడాన్ని గుర్తించి స్వాధీనం చేసుకుని నోటీసులు జారీ చేశారు. పండ్లు తీపి, రంగు వచ్చేందుకు వినియోగిస్తున్న వివిధ రసాయనాలను గుర్తించి దుకాణాల యజమానులకు జరిమానాలు విధించారు. అసహజ పద్ధతుల్లో పండ్లను తయారు చేయడం, ఆహారాన్ని కల్తీ చేయడం, విక్రయించడం చట్టవ్యతిరేకమైన చర్యలని తెలిపారు. పండ్ల దుకాణాల అసోసియేషన్ సభ్యులు సహకరించి తమ సమాచారం అందించాలని, నిబంధనలు ఉల్లంఘించే విక్రయదారులపై కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

వైఎస్సార్‌సీపీలో చేరికలు



పార్టీలో చేరిన టీడీపీ, జనసేన కార్యకర్తలతో ఎంపీ అభ్యర్థి విజయసాయిరెడ్డి, కోవూరు ఎమ్మెల్యే ప్రసన్న

నెల్లూరు సిటీ: నెల్లూరు రూరల్ నియోజకవర్గ పరిధిలోని ఆమంచర్ల పంచాయతీ అయ్యప్పకంద్రిగకు చెందిన టీడీపీ యువ నాయకుడు చింతారెడ్డి శ్రీనివాసులురెడ్డి విజయ డెయిరీ చైర్మన్ కొండ్రెడ్డి రంగారెడ్డి సమక్షంలో సోమవారం వైఎస్సార్‌సీపీలో చేరారు. వైఎస్సార్‌సీపీ రూరల్ ఎమ్మెల్యే అభ్యర్థి ఆదాల ప్రభాకర్‌రెడ్డి కార్యాలయంలో రంగారెడ్డి పార్టీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ సంక్షేమాభివృద్ధికి ఆకర్షితులై టీడీపీ నాయకులు పార్టీలో చేరడం శుభపరిణామమన్నారు.పార్టీలో చేరిన వారికి ఆదాల ప్రభాకర్‌రెడ్డి అండదండలు ఎల్లప్పుడూ ఉంటాయన్నారు. పార్టీ నాయకులు చింతా సురేందర్‌రెడ్డి, వెంకటేశ్వరనాయుడు, శివాజీనాయుడు, గంగాధర్‌యాదవ్, మోహన్‌రెడ్డి తదితరుల పాల్గొన్నారు.

టీడీపీ, జనసేన పార్టీ కార్యకర్తల చేరిక

నెల్లూరు(దర్గామిట్ట) : వైఎస్సార్‌సీపీ సంక్షేమాభివృద్ధి పాలనకు ఆకర్షితులై కోవూరు నియోజకవర్గం ఇందుకూరుపేట మండలం కుడితిపాళేనికి చెందిన 100 మందికిపైగా టీడీపీ, జనసేన పార్టీ కార్యకర్తలు వైఎస్సార్‌సీపీలో చేరారు. జొన్నవాడ ఆలయ చైర్మన్ మావులూరి శ్రీనివాసులురెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకుడు బట్టిపాటి నరేంద్రరెడ్డి ఆధ్వర్యంలో పార్టీలో చేరిన వారికి నెల్లూరులోని జిల్లా వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో నెల్లూరు ఎంపీ అభ్యర్థి విజయసాయిరెడ్డి, కోవూరు ఎమ్మెల్యే అభ్యర్థి నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు.

ఆమ్‌ఆద్మీ పార్టీ నాయకుల చేరిక

ఆమ్‌ఆద్మీ పార్టీ జిల్లా అధ్యక్షుడు గుర్రంకొండ సర్దార్, నెల్లూరురూరల్ అసెంబ్లీ ఇన్‌చార్జి మురళీకృష్ణ వంద మందికిపైగా కార్యకర్తలతో కలిసి వైఎస్సార్‌సీపీలో చేరారు. వైఎస్సార్‌సీపీ ఎంపీ అభ్యర్థి విజయసాయిరెడ్డి తన క్యాంపు కార్యాలయంలో పార్టీలో చేరిన వారికి కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా విజయసాయిరెడ్డి మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమాభివృద్ధి కార్యక్రమాలకు ఆకర్షితులై వివిధ పార్టీలకు చెందిన నాయకులు పార్టీలో చేరుతుండడం శుభపరిణామమన్నారు.



శ్రీనివాసులురెడ్డిని పార్టీలోకి ఆహ్వానిస్తున్న రంగారెడ్డి



పార్టీలో చేరిన ఆమ్‌ఆద్మీ నాయకులతో విజయసాయిరెడ్డి

పచ్చ నేతల అత్యుత్సాహం

- నెల్లూరు నగర నియోజకవర్గంలో ఎన్నికల నియమావళి ఉల్లంఘన
- ఆలయ ప్రాంగణంలో చేరికల కార్యక్రమం చేపట్టిన నారాయణ వర్గం



గణపతి ఆలయంలో టీడీపీలో చేరిక కార్యక్రమం చేపట్టిన నాయకులు

నెల్లూరు సిటీ: తెలుగుదేశం పార్టీ నాయకులు ఏమాత్రం ఎన్నికల నియమావళిని పాటించడం లేదు. ఆలయాలను కూడా ఎన్నికల ప్రచారాలకు వేదికగా మార్చుకోవడం విమర్శలకు తావిస్తోంది. నగరంలోని సత్యనారాయణపురంలో ఉన్న గణపతి ఆలయంలో నారాయణ విద్యాసంస్థల జనరల్ మేనేజర్ వేమిరెడ్డి విజయభాస్కర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆ ఆలయ మాజీ చైర్మన్ గౌరాబత్తిన సుబ్బారావు తన వర్గంతో సోమవారం టీడీపీలో చేరారు. ఈ కార్యక్రమాన్ని ఆలయ ఆవరణలో నిర్వహించడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

నిబంధనల ఉల్లంఘన

రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఎన్నికల నిబంధనలను తప్పకుండా పాటించాలని అన్ని రాజకీయ పార్టీలకు ఆదేశాలిచ్చింది. అయితే టీడీపీ నేతలు మాత్రం తమ పని తాము చేసుకుంటూ వెళుతున్నారు. ఇటీవల ఆటోలకు జెండాలను కట్టి అనుమతులు లేకుండానే ప్రచారం నిర్వహించారు. మరోసారి సోమవారం ఆలయంలోనే టీడీపీ పార్టీ కండువాలు వేసుకుని చేరికలు నిర్వహించడంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

ఇఫ్తార్ విందు



నెల్లూరు(బృందావనం): పవిత్ర రంజాన్ మాసాన్ని పురస్కరించుకుని 12వ డివిజన్ పరిధిలోని పెద్దమసీదులో సోమవారం నిర్వహించిన ఇఫ్తార్ విందులో డీసీసీబీ మాజీ చైర్మన్ ఆనం విజయకుమార్‌రెడ్డి, విజయ డెయిరీ చైర్మన్ కొండ్రెడ్డి రంగారెడ్డి పాల్గొన్నారు. తొలుత మసీదులో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు వేణుగోపాల రెడ్డి, స్థానిక ముస్లిం మైనార్టీ నాయకులు చాన్, రషీదకరిముల్లా, అన్వర్‌బాషా, ఉమర్, ముదస్సర్, సలీం, యూసుఫ్, ముజాహిద్, కరీం, తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు సకల శుభాలు కలగాలి



నెల్లూరు(బారకాసు): క్రోధి నామ తెలుగు సంవత్సరాది ఉగాది పండగను పురస్కరించుకుని నగర ప్రజలకు మేయర్ పొట్లూరి స్రవంతిజయవర్ధన్ సోమవారం ఒక ప్రకటనలో శుభాకాంక్షలు తెలిపారు. షడ్రుచుల సమ్మేళనంతో ప్రారంభమయ్యే ఉగాది తెలుగు లోగిళ్లలో నూతన సంవత్సర శోభను తెస్తూ కొత్త లక్ష్యాలకు, కొత్త ఆలోచనలకు, ప్రతి ఒక్కరి ఉజ్వల భవిష్యత్తుకు, తద్వారా నగరాభివృద్ధికి దోహదపడాలని అభిలాషించారు. కొత్త ఏడాదిలో నగర ప్రజలకు సకల శుభాలు కలగాలని ఆకాంక్షించారు.

సుఖసంతోషాలతో పండగ జరుపుకోవాలి



నెల్లూరు(బృందావనం): క్రోధి నామ సంవత్సర ఉగాది పండగను పురస్కరించుకుని నెల్లూరు సిటీ నియోజకవర్గ ప్రజలకు వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఎండీ ఖలీల్‌అహ్మద్ సోమవారం ఒక ప్రకటనలో శుభాకాంక్షలు తెలిపారు. కొత్త ఏడాదిలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, నగర ప్రజలకు ఆ భగవంతుని ఆశీస్సులు ఎల్లవేళలా ఉండాలని, సుఖసంతోషాలతో పండగను జరుపుకోవాలని ఆకాంక్షించారు.

వాకర్స్‌కు వైద్యపరీక్షలు



నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట):ఏసీ సుబ్బారెడ్డి స్టేడియం వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఇంజిన్ రామానాయుడు సౌజన్యంతో వాకర్స్‌కు ఉచిత మెడికల్ క్యాంప్‌ను సోమవారం నిర్వహించారు. 300 మంది వాకర్స్‌కు బీపీ, షుగర్ పరీక్షలు నిర్వహించారు.ఈ సందర్భంగా అసోసియేషన్ కార్యదర్శి గుర్రం సురేంద్రబాబు మాట్లాడుతూ దాతలు, అసోసియేషన్ సభ్యుల సహకారంతో గత 20 ఏళ్లుగా ప్రతి నెలా మొదటివారం వాకర్స్‌కు ఉచితంగా మెడికల్ క్యాంప్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అసోసియేషన్ అధ్యక్షుడు దాసరి అనంతరామారావు, కోశాధికారి అరిగెల సాయిరామ్, మాజీ అధ్యక్షుడు బాసం శేషగిరిరావు, కిలారి తిరుపతినాయుడు, కనకట్ల రఘురామ్‌ముదిరాజ్, వేలూరు రంగారావు పాల్గొన్నారు.

రెడ్‌క్రాస్‌లో ముందస్తు ఉగాది సంబరాలు



నెల్లూరు(వీఆర్సీసెంటర్): నగరంలోని ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీలో ముందస్తు ఉగాది సంబరాలను సోమవారం నిర్వహించారు. రెడ్‌క్రాస్ జిల్లా చైర్మన్ ఆదేశాల మేరకు ఐఆర్సీఎస్, ఎమ్మెస్సార్ స్పాస్టిక్ సెంటర్‌లలో రెడ్‌క్రాస్ మేనేజ్‌మెంట్ సభ్యుడు దాసరి రాజేంద్రప్రసాద్ ఆధ్వర్యంలో దివ్యాంగ చిన్నారుల సమక్షంలో ఉగాది సంబరాలు జరిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రోధి నామ సంవత్సరంలో ప్రజలందరికీ మంచి జరగాలని, అందరూ ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో స్పాస్టిక్ సెంటర్ ప్రిన్సిపల్ గురునాథరావు, సభ్యులు అరుణమ్మ, వైస్‌ప్రిన్సిపల్ ఉమామహేశ్వరి, నవీద్‌అక్తర్, నవీన్, రెడ్‌క్రాస్ సిబ్బంది, మానసిక దివ్యాంగులు, తల్లిదండ్రులు, పాల్గొన్నారు.

ఆదాలకు మద్దతుగా విస్తృత ప్రచారం



నెల్లూరు సిటీ: నెల్లూరు రూరల్ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి ఆదాల ప్రభాకర్‌రెడ్డికి మద్దతుగా 31వ డివిజన్‌లో ఏపీఆర్ ఆర్మీ సభ్యులు సోమవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ జిల్లా జనరల్ సెక్రటరీ అనితారెడ్డి, నాయకులు నరసింహారెడ్డి, ఇక్బాల్, వైవీరెడ్డి తదితరులు పాల్గొన్నారు.